కార్మిక లోకం

సి. ఐ. టి. యు. ఆంధ్రప్రదేశ్ కమిటి మాసపత్రిక. ప్రతి నెల 1వ తేదీన వెలువడుతుంది.

సంపుటి 4 ★ డిశంబరు 1974 ★ వెల : 25 పైసలు ★ సంచిక 2

భయంకర సంక్షోభం

— బి. టి. రణదివె

1929 లో ఊహించు భయంకర సంక్షోభం ఇప్పుడు అభివృద్ధిచెందిన ప్రపంచాన్ని ఆవహించింది. ఈ సంక్షోభం యొక్క భీకరత్వాన్ని అనుభవిస్తున్న ఆయా దేశాలు అంగీకరించడంకూడా జరిగింది. ద్రవ్యోల్బణపుతాకిడి ఉత్పత్తికాబడిన సరుకులు విడుదల కాకపోవడం, ఉత్పత్తి మందగించడం, తయారు కాబడిన సరుకులు నాశనం చేయడం మొదలగు రూపాలలో గోచరమౌతున్నది. నిరుద్యోగంకూడా తావు చేసుకుంటున్నది. పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గం ఈ నిరుద్యోగాన్ని, వేతనస్థంభనను నిరంతరం పోరాటాలతో ఎదుర్కొంటున్నది.

1961-72 మధ్య 55 కోట్లమంది కార్మికులు సమ్మె పోరాటాలలో పాల్గొన్నారు. ఒక్క 1972 లోనే 4 కోట్ల, 30 లక్షలమంది సమ్మెలలో పాల్గొన్నారు. అదేగాక 1973 మొదటి 9 నెలల్లో ఇంకా ఎక్కువమంది సమ్మె పోరాటాల్లో పాల్గొన్నారు. కార్మికవర్గంయొక్క ఈ పోరాట పటిమవల్ల పెట్టుబడిదారులు ఈ అర్థిక సంక్షోభాన్ని కార్మికవర్గంపై బహిరంగంగా మోపలేకపోతున్నారు. పెట్టుబడిదారీ దేశాల గుత్తాధిపతులు దేశఆర్థిక స్థితిని తమగుప్పెట్లో పూర్తిగా పెట్టుకోలేకపోతున్నారు.

పెట్టుబడిదారీ ప్రపంచం తీసుకుంటున్న అనేక చర్యలు- పొదుపు కార్యక్రమాలు, బడ్జెటు కోతలు, ద్రవ్యోల్బణాన్ని నిరోధించే చర్యలు, అన్నీ ఉత్పత్తిని నాశనం చేయడానికి, నిరుద్యోగం పెంచడంతో మాత్రమే ముగుస్తున్నాయి. కాని ఈ రోజుల్లో నిరుద్యోగాన్ని పెంచడమంటె నిరుద్యోగ భృతిని ఆ యా దేశాలలోని కార్మికులకు చెల్లించవలసి ఉంది. అంటే మరలా పెద్దమొత్తంలో ద్రవ్యం చలామణిలోకి వస్తుంది. ద్రవ్యోల్బణం, అధికధరలు లేకుండా నిరుద్యోగాన్ని తగ్గించలేదు. కానీ ద్రవ్యోల్బణం అధిక ధరలు వారిని దివాళా తీయిస్తున్నాయి. ఈ సంధిగ్ధావస్థలో నేడు పెట్టుబడిదారీవ్యవస్థ కొట్టుమిట్టాడు తున్నది. ఒక అమెరికా ప్రొఫెసర్ ఇలా చెప్పాడు: 'ద్రవ్యోల్బణాన్ని అరికట్టడంకోసం మనం అమెరికా అభివృద్ధిని రెండు మూడు సంవత్సరాలు ఆపగలిగి, నిరుద్యోగాన్ని 5½ శాతం స్థాయిలో ఉంచగలగడ మనేది వాంఛనీయమా ? వాంఛనీయమే అయితే ప్రస్తుతపు అమెరికా రాజకీయ పరిస్థితుల్లో అది సాధ్యపడుతుందా ?'

ఇది అంతా పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క దివాళాకోరుతనాన్ని నిరూపిస్తున్నది. 6 శాతం నిరుద్యోగం వారిని పట్టి పీడిస్తున్నది. వారి అర్థిక విధానమే ఈ మార్గంవైపు పోయేలా ప్రోత్సాహిస్తున్నది.

అభివృద్ధి చెందుతున్న ప్రపంచంయొక్క ఈ స్థితి ఇండియాలో ఇప్పటికే కనపడుతున్నది. ఇక్కడ ఉత్పత్తి మందగింపు, అధికోత్పత్తి కొరతను, ఎప్పుడూ పెరుగుతున్న డిమాండులో తల దూర్చుతున్నాయి.

భారతదేశంలోని ద్రవ్యోల్బణ పరిస్థితులు బలవంతంగా పేదతరగతుల సంపదను సంపన్నవర్గాలకు దక్కేలా చేస్తున్నది. పల్లె సీమల్లో వ్యవసాయ కార్మికులకు సేద్యానికి భూమిలేక, చేయడానికి పనులులేక కొనుగోలు చేయలేని స్థితిలో, పారిశ్రామిక సరుకులపై ప్రజలు అధారపడాల్సి వస్తున్నది.

ఒకవైపు అధిక ధరలు ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేయడంవల్ల పరిశ్రమల్లో పూర్తిఉత్పత్తి పడిపోయింది. మరొకవైపు ఉత్పత్తిదారుల కుత్సిత చర్యలు, అధికధరలు సామాన్యుని కొనుగోలు శక్తిని క్షీణింపజేస్తే ప్రజల కొనుగోలు శక్తికి తగ్గట్టు ఉత్పత్తి లేదనే భ్రమ కలుగుతున్నది.

ఈ వాస్తవ పరిస్థితిని శ్రీమతి ఇందిరాగాంధీ కూడా కాదనలేని పరిస్థితిని మనం చూస్తున్నాము. వేలాది మరమగ్గాలు పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర మరి అనేక రాష్ట్రాలలో పని చేయడం లేదు. చేతి మగ్గాలవారికి డిమాండు లేదు. కొత్తగా ఆర్డరులు రావడంలేదని, ఉత్పత్తి అలానే ఉంటున్నదని పత్రి

కృష్ణాజిల్లా వేతనస్థంభన వ్యతిరేక సదస్సు డిశంబరు 15న విజయవాడలో

పరిశ్రమ రికార్డులు తెలుపుతున్నాయి. నవంబరులో డిప్యూటీ మంత్రిగారు రాజ్యసభలో చెబుతూ 100 కోట్ల రూపాయల విలువగల 2.5 లక్షల బట్టల బేళ్ళు గిడ్డంగులలో ఉన్నట్లు చెప్పారు. మిశ్రమ ఆర్థిక పరిస్థితులు, కొనుగోలు శక్తి క్షీణిం చడం, సకాలానికి సరుకు విడుదలకాకపోవడం దానికికారణం.

అహమ్మదాబాద్ బట్టలమిల్లులలో మూడవ షిఫ్టు తీసి వేయడంవల్ల 5,000 మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. తమిళనాడులోని బకింగ్‌హాం, కర్నాటక మిల్లులు 25 శాతం ఉత్పత్తిని తగ్గించివేసినట్లు ప్రకటించారు. దక్షిణభారత వస్త్ర నిర్మాతలు పెద్ద సంఖ్యలో నూలు బేళ్ళు అమ్మకానికి ఉన్నట్లు ప్రకటించారు.

అలాగే ఉక్కు పరిశ్రమలోకూడా ఉత్పత్తిఅయిన సరుకు పేరుకుంటున్నది. అందుకనే ఉక్కు స్టీలు కంట్రోలర్ పోయిన అక్టోబర్‌లో బెంగుళూరులో మాట్లాడుతూ ప్రభుత్వం కంట్రోలును పూర్తిగాగానీ, పాక్షికంగాగానీ ఎత్తివేయుటకు 2 లేక మూడు నెలల్లో ఒక నిర్ణయానికి రావాలని చెప్పాడు. 3.5 లక్షల టన్నుల ఉక్కు నిల్వలు ఉన్నట్లు ఆయన చెప్పాడు. ఒక్క హిందూస్తాన్ స్టీల్ మిల్లులోనే లక్ష టన్నుల ఉక్కు నిల్వలు ఉన్నట్లు ఆయన చెప్పాడు.

ఇంజనీరింగు పరిశ్రమలోకూడా తీవ్రసంక్షోభం తల ఎత్తింది. పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్‌లలో వేలాదిమంది కార్మికులు నిరుద్యోగానికి గురిచేయబడ్డారు. చాలాసందర్భా లలో రిట్రెంచిమెంటు పరిహారంకూడా ఇవ్వలేదు. భోపాల్ లోని హెవీ ఎలక్ట్రికల్ ప్లాంట్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు ఇచ్చిన ఆర్డరులమేరకు సరుకు తీసుకుపోక పోవడంవల్ల మొత్తం సంవత్సరిక ఉత్పత్తిలో సగం పోగుపడ్డది.

ఇవి అన్నీ కార్మికవర్గం మేలుకోవడానికి తగిన హెచ్చ రికలు. ఇవి ఇలాగే సాగితే, పరిశ్రమలు మూతపడతాయి; ఉద్యోగావకాశాలు సన్నగిల్లుతాయి. వేతనస్థంభన మొదలగు వాటికి కార్మికవర్గం గురిఅవుతుంది.

ఈ భీతావహ పరిస్థితి మొత్తం కార్మిక వర్గాన్ని కర్షక లోకాన్ని, ముఖ్యంగా వ్యవసాయ కార్మికులు, పేదరైతులను, పీడిస్తుంది. ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడిదారీ-భూస్వామ్య అనుకూల విధానాలు, దేశీయ, విదేశీయ గుత్తాధిపతుల దోపిడీకి అనుకూలమైన, కార్మిక, కర్షకులను దోపిడీచేసే విధా నాలు దేశాన్ని ఈ దుస్థితికి తెచ్చాయి.

వేతన స్థంభన కంటే ఎక్కువ హానిచేసే ప్రభుత్వ విధానాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలి. ఆగస్టులో కార్మికులు, ఉద్యోగులు గొప్పసదస్సు జరిపి, అందులో నిర్ణయాలు తీసుకొని సమ్మెలు, బంద్‌లు జరపడం ముదావహం ప్రభుత్వంనుండి రాబోవు దాడులను తిప్పికొట్టడానికి ఈ ఐక్య తను బలవత్తరం చేయాలి. నిరుద్యోగానికి వ్యతిరేకంగానూ, నిరుద్యోగ భృతికొరకూ ముక్తకంఠంతో నినదించాలి. అలాగే అధికధరలకు వ్యతిరేకంగానూ, వేతనస్థంభనకు, ఆదాయపు కోతలకు, గుత్తాధిపతుల సంపదను జాతీయంచేయుటకు, దొంగనిల్వ దార్ల నుండి తిండిగింజలు వెలికితీసి సామాన్యులు కొనుక్కోగలిగే ధరలకు అమ్మించుటకు ఐక్యమై కార్మికవర్గం పూనుకోవాలి. మరియు అవసర ప్రాతిపదికపై జీతాలు,

యన్. సి. సి. ఆర్. యస్. ఆధ్వర్యాన బ్రహ్మాండమైన బహిరంగసభ-గుంతకల్లులో

యన్.సి.సి.ఆర్.యస్. అఖిలభారత కన్వీనర్ శ్రీ జార్జి ఫెర్నాండెజ్ రాకసందర్భంగా గుంతకల్లు పట్టణంలో 10 వేల మందితో బ్రహ్మాండమైన బహిరంగసభ జరిగింది. ఈ మధ్య కొన్నిసంవత్సరాలుగా గుంతకల్లులో యింత పెద్దసభజరగలేదు.

సౌత్ జోన్, సదరన్ రైల్వేమజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంటు శ్రీ శివరామన్ సభకు అధ్యక్షత వహిం చారు. అనేక కార్మిక సంఘాల తరపున ఫెర్నాండేజ్‌కు పూలమాలలు వేయుటం జరిగింది.

శ్రీ ఫెర్నాండేజ్ షుమారు 2½ గంటలసేపు ఉత్తేజ కరమైన ఉపన్యాసం యిచ్చారు. సమ్మె అనంతర పరిస్థితులను, సమీక్షిస్తూ రైల్వేఅధికార్ల బురాక్రసీని నిశితంగా ఖండించారు. కోర్టు తీర్పులను సహితం అమలుచేయక లిటిగేషన్‌ద్వారా కార్మికులను హింసిస్తున్న వైఖరి దుయ్యబట్టారు.

రైల్వేకార్మికులను కోర్టులచుట్టూ త్రిప్పుతున్న ప్రభుత్వం దొంగరవాణా వ్యాపారులను కోర్టుల్లో ప్రవేశపెట్టటానికే జంకుతున్నదని విమర్శించారు.

యన్. సి. సి. ఆర్. ఎస్. లోని భాగస్వాములైన సంస్థల నాయకులు తమ మనుగడకోసం స్వతంత్రంగా పని చేయాల్సివచ్చినా అలాంటి వారందరికీ శ్రీ ఫెర్నాండెజ్ ఒక విషయం గుర్తు చేశారు. సమ్మెద్వారా ఐక్యమైన రైల్వే కార్మికులు, డిమాండుల విషయంలో ఒంటరిగా విడి విడిగా పోరాడి సాధించేది ఏమీ వుండదనీ అందువల్ల యన్. సి. సి. ఆర్. యస్. ఉండితీరాల్సిందేనని ఖరాఖండిగా చెప్పారు.

ఫాసిస్టుల నాయకత్వాన ఉన్న చిలీ ప్రభుత్వం సహితం ఐ. టి. యఫ్. కమీషన్ను ఆ దేశం సందర్శించ నిచ్చిందిగాని ప్రజాస్వామిక ప్రభుత్వ మనుకునే భారత ప్రభుత్వం ఐ.టి.ఎఫ్ కమీషన్ సందర్శనకు అనుమతివ్వక పోవటంబట్టి కార్మికుల పట్ల యీ ప్రభుత్వం ఎంత పైశాచికంగా వ్యవహరిస్తున్నదో తేలుతుందన్నారు.

గుంతకల్ డివిజన్ యన్. సి. సి. ఆర్. యస్. కన్వీనర్ శ్రీ మైలాండన్ వందన సమర్పణతో సభ జయప్రదంగా ముగిసింది.

వ్యవసాయ కార్మికుల జీవనపరిస్థితులు మెరుగుపర్చుకొనుటకు, వ్యవసాయ దారులు ఉత్పత్తిచేసిన సరుకుకు న్యాయమైన ధర గిట్టుబాటు కొరకు, గుత్తాధిపతుల సంపదపై పన్ను విపరీతంగా పెంచమని కార్మిక వర్గం ముక్తకంఠతో ఘోషించాలి.

అలాగే చీకటి బజారుకు వ్యతిరేకంగా, అలాంటి ప్రయ త్నాలకు వ్యతిరేకంగానూ, చీకటి బజారులో సంపాదించిన సొత్తును జప్తుచేయుటకు ప్రభుత్వాన్ని డిమాండు చేయాలి.

ఈ కార్యక్రమాలవల్ల కార్మికవర్గం పెట్టుబడిదారుల, భూస్వాముల కుతంత్రాలను, ఆర్థిక సంక్షోభానికి ప్రజలను బలిపశువులుగా చేసే విధానాలను తిప్పికొట్టగలదు.

మోటారు ట్రాన్సుపోర్టు వర్కర్స్ ఫెడరేషన్ 7 వ మహాసభ

ఆంధ్రప్రదేశ్ మోటారుట్రాన్సుపోర్టువర్కర్సు ఫెడరేషన్ 7వ మహాసభ రాజమండ్రిలో నవంబరు9, 10 తేదీలలో జరిగింది. మహాసభకు వివిధజిల్లాలనుండి మొత్తం 128 మంది ప్రతినిధులు హాజరైనారు. ఫెడరేషనుకు అనుబంధం కాని 12 మంది సౌహార్ద ప్రతినిధులుగా వచ్చారు. ప్రతినిధులుగా కాక మరో 20 మంది కూడా పాల్గొన్నారు.

9వ తేది ఉదయం 10 గంటలకు ఫెడరేషన్ పతాకాన్ని శ్రీ వై. మునిరత్నం (టి. టి. డి. ట్రాన్స్‌పోర్టు వర్కర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి) ఎగురవేశారు. ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ జి. యస్. బాలాజీదాస్ మహాసభకు అధ్యక్షత వహించారు. ఆహ్వానసంఘం తరపున శ్రీ నలపాల సూర్యారావుగారు ప్రతినిధులకు స్వాగతం పలికారు.

సభా ప్రారంభంలో ముజఫర్ అహ్మద్, హరేకృష్ణ కోనార్, యస్. సుందన్న, వి. కె. కృష్ణమీనన్‌ల మరణానికి మోటారుకార్మికకార్యకర్తలు బాపిరాజు, ముత్యాలరావుగార్ల మరణానికి సంతాపం తెలుపుతూ భరత్‌పూర్‌లోను, నెల్లిమర్లలోను పోలీసు కాల్పులకు మరణించిన కార్మికులకు జోహార్లర్పిస్తూ ప్రతినిధులు 2 నిమిషాలు మౌనం పాటించారు.

మహాసభప్రాధాన్యతనువివరిస్తూ అధ్యక్షులు శ్రీ బాలాజీదాస్‌గారు మాట్లాడారు. దినదినం జాతి జీవనంలో మోటారు ట్రాన్సుపోర్టుకు పెరుగుతున్న ప్రాధాన్యతనుసోదాహరణంగా ఎత్తిచూపారు. మిగతా పరిశ్రమల్లోలాగ కాక యీ పరిశ్రమలో కార్మికులు అనేకమంది యజమాన్లతో పోరాడవలసివుంటుందన్నారు.

సి.ఐ టి.యు, ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షులు శ్రీ పర్స సత్యనారాయణ మహాసభ ప్రారంభోపన్యాసం గావించారు.

ప్రధాన కార్యదర్శి శ్రీ నండూరి ప్రసాదరావు ఫెడరేషన్ కార్యకలాపాల రిపోర్టును ప్రవేశపెట్టారు. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను సమీక్షించుతూ యీ స్థితిలో భారత కార్మికవర్గం ప్రభుత్వ దమనకాండకు ఎలా గురౌతున్నదీ వివరించారు. మొత్తం కార్మికవర్గం జరిపేపోరాటంలో భాగంగా మోటారు కార్మికోద్యమం ముందుకు సాగాలన్నారు.

చర్చలనంతరం నివేదిక ఏకగ్రీవంగా ఆమోదించబడింది. అఖిలభారత రోడ్‌ట్రాన్స్‌పోర్టు వర్కర్సు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాధమీనన్ (యం. పి), సుజిత్‌దాస్‌గార్లు, సి. ఐ టి. యు, కార్యదర్శి శ్రీ యం. కె. పాంధే మరియు వివిధ వుద్యోగ కార్మిక సంఘాలు పంపిన సందేశాలు చదివి వినిపించబడినాయి. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ యం. వి. సుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్సు ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు శ్రీ ముత్తారావుగార్లు స్వయంగా హాజరై సందేశాలిచ్చారు.

లారీ కార్మికుల సమస్యలపైన, వర్క్‌మెన్స్ కాంపెన్‌సేషన్ యాక్టుసవరించాలని, మోటారు కార్మికుల కనీస వేతనాలను తిరిగి సవరించాలని, ఆర్. టి. సి.లో రిక్రూట్‌మెంట్‌పైన, ఆర్. టి. సి. పనివారలపై పెంచబడుతున్న పనిభారంమీద, టి. టి. డి. కార్మికుల సమస్యలపైన తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

అనంతరం ఫెడరేషన్ నూతన కార్యవర్గంగా ఈ క్రింది వారిని ఎన్నుకోవటమైనది.

అధ్యక్షులు : శ్రీ జి. యస్. బాలాజీదాస్

ఉపాధ్యక్షులు : శ్రీ మహమ్మద్‌మీరా, షేక్‌హుస్సేన్, శ్రీ ఎస్. ఎ. ఏకాంబరం, శ్రీ వి. మాలకొండయ్య.

ప్రధాన కార్యదర్శి : శ్రీ నండూరి ప్రసాదరావు,

కార్యదర్శులు : శ్రీయుతులు వేమూరి సుబ్బారావు, కొండ్రగుంట వెంకటేశ్వర్లు, వి. శ్రీహరి, ఉప్పులూరి సుబ్బారావు.

కోశాధిపతి : శ్రీ వెల్లంకి మోహనరావు.

సభ్యులు : శ్రీయుతులు దిగుమర్తి విశ్వనాథం, యస్. గంగాధరరెడ్డి, నూకల సోమరాజు, గంటె సత్యనారాయణ, డి. రాఘవులు, సి. హెచ్. వెంకటేశ్వరరెడ్డి, కె. కొండయ్య, వై జోసెఫ్, జి. వెంకట్రాజు, కె. జయంరాంపిళ్ళె, డి.దశరథ రామిరెడ్డి, పాలూరి ఎల్లప్ప, మరికొందరిని కోఆప్టు చేసికొనుటకు కమిటీకి అధికారమివ్వటమైనది.

10 వ తేదీ సాయంత్రం ప్రతినిధులతో, పట్టణ కార్మికులతో ఊరేగింపు జరిగింది. తరువాత సుబ్రహ్మణ్య మైదానంలో జరిగిన బహిరంగసభలో శ్రీయుతులు జి.ఎస్.బాలాజీదాస్, పర్స సత్యనారాయణ, నండూరి ప్రసాదరావుగార్లు ప్రసంగించారు.

రైల్వే కార్మికుల తొలగింపు ఆజ్ఞలు చెల్లవంటూ వివిధ కోర్టుల తీర్పులు

14 (II) లేదా 311 (2) (B) క్రింద రైల్వే కార్మికుల డిస్మిసల్ ఆర్డర్సు చెల్లవంటూ కలకత్తా హైకోర్టు తీర్పుఇచ్చిన తర్వాత అహ్మదాబాద్ హైకోర్టు కూడ రైల్వే కార్మికులనుకూలంగా తీర్పుచెప్పింది. లిటిగేషన్‌లో దీర్ఘకాలంపెట్టి కార్మికులను అనవసరంగా బాధపెట్టకుండా వెంటనే అందరినీ పనిలోకి తీసుకోవలెనంటూ తీర్పులో చెప్పబడింది.

ఆంధ్రాహైకోర్టు రూలు 149 RI ను క్యాజువల్ లేబరుకు వర్తింపరాదంటూ తీర్పుచెప్పింది. అయినా రైల్వే అధికారులు కోర్టు తీర్పును గౌరవించలేదు అప్పీలుకు పోయారు. మరొక కేసులో కలకత్తాకోర్టు149 RI క్రింద తొలగించబడిన 200 మంది క్యాజువల్ పనివారికి ముందుగా జీతాలు, నోటీసు యివ్వలేదు కాబట్టి 149 RI క్రింద యిచ్చిన ఆర్డరును చెల్లదని తీర్పు చెప్పింది.

కేరళ హైకోర్టుకూడ కార్మికుల కనుకూలంగా తీర్పు చెప్పినట్లు తెలుస్తోంది.

కోర్టుల తీర్పులు స్పష్టంగా వున్నప్పటికీ ప్రభుత్వం లిటిగేషన్‌ద్వారా ఒకకోర్టునుండి మరొక కోర్టుకు సాగదీస్తూ కార్మికులను హింసించటమే పనిగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.

యూనియన్ వార్తలు

గుంటూరు సిటీ టైలరింగ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడి సమావేశం నవంబరు 20న హైవేస్ యూనియన్ కార్యాలయంలో జరిగింది. ముందుగా 200 మంది టైలర్స్ ప్రదర్శన జరిపారు. సి ఐ టి.యు రాష్ట్రకమిటీ కార్యదర్శి శ్రీ కొండ్రగుంట వెంకటేశ్వర్లుగారు సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తూ సి. ఐ. టి, యు ఉద్యమం అండతో టైలర్ వర్కర్స్ తమ కోర్కెలను సాధించుకొన్న వైనాన్ని వివరించారు. విజయవాడ సిటీ టైలర్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీ అబ్దుల్ లతీఫ్, అబ్దుల్ సలాం గార్లు కూడా హాజరై సందేశాలను యిచ్చారు

వేతనాలను 20% పెంచాలని, ప్రావిడెంటు ఫండు, గ్రాట్యూటి, బోనసు చట్టాలను అమలు చేయాలని కోరుతూ తీర్మానాలు చేశారు.

* * *

పశ్చిమ గోదావరిజిల్లా వర్కుచార్జిడ్ ఎంప్లాయీస్ యూనియన్ ద్వితీయ మహాసభ శ్రీ ఎస్. హెచ్. సన్యాసిరావు గారి అధ్యక్షతన తాడేపల్లి గూడెంలో నవంబరు 17న జర్గింది

రాష్ట్ర పంచాయితీరాజ్ (జిల్లా పరిషత్) ఎంప్లాయీస్ యూనియన్ ప్రధానకార్యదర్శి శ్రీ యం. కె. స్వామి యీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వంతో జరిపిన సంభాషణల వివరాలు తెలిపారు.

రాష్ట్రసంఘంలో యీ జిల్లాసంఘాన్ని కలిపివేయుటకు మహాసభ తీర్మానించింది.

కోర్కెల సాధనకై కోర్కెలదినం, ఒకరోజు సమ్మె జరుపుటకు సిద్ధం గావాలని శ్రీ స్వామి ప్రతినిధులను ఉద్బోధించారు.

సభకు జిల్లా అంతటినుండి 76 మంది వర్కుఇనస్పెక్టర్లు, గ్యాంగుమెన్లు హాజరైనారు.

* * *

ప్రకాశంజిల్లా పరుచూరులోగల జనరల్ ట్రేడింగ్ టుబాకో వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం నవంబరు 17 న శ్రీ పుప్పాల సుబ్బారావుగారి అధ్యక్షతన జరిగింది.

ప్రధాన కార్యదర్శి శ్రీ అంబటి శేషగిరిరావు కార్యకలాపాల నివేదిక సమర్పించుతూ రెండవ యూనిట్‌లో యూనియన్ కృషిఫలితంగా బోనసు వగైరాల నిమిత్తం లక్షా యాభైవేల రూపాయలు సాధించుకొన్న విషయాన్ని ఎత్తి చూపారు.

ఒకటవ యూనిట్‌లోకూడ కార్మికులకు బోనసు, ఎరన్డ్ లీవు చెల్లించాలని తీర్మానించారు. 1500 మందికి చెల్లించవలసిన గ్రాట్యూటిని వెంటనే చెల్లించాలనికూడ తీర్మానించబడింది.

* * *

నెల్లూరు జిల్లా లారీవర్కర్స్ యూనియన్ జనరల్‌బాడి సమావేశంలో నెల్లూరు జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు అక్రమంగా జరిగే ధాన్యరవాణాను నిరోధించాల్సిన ప్రత్యేక బాధ్యత లారీకార్మికులపై వున్నదన్నారుయూనియన్‌అధ్యక్షులు శ్రీ మాల కొండారెడ్డిగారు.

పెరిగిన నేటి ధరల దృష్ట్యా లారీడ్రైవరుకు రు225/-లు క్లీనరుకు రు175/లు జీతం అక్టోబరు నెల నుండి పెంచాలని డిమాండుచేస్తూ జనరల్‌బాడి తీర్మానించింది

* * *

తిరుములకొండపైకి టూరిస్టుబస్సులు సరాసరి పోవుటకు అనుమతిస్తూ ఈమధ్యనే దేవస్థానంబోర్డు తీర్మానించింది. ఈ పద్ధతిని అమలుచేస్తే దేవస్థానానికి చెందిన 200 బస్సులు మూలబడతాయి. ఇప్పుడు పనిచేస్తున్న వర్కుషాపు కార్మికులను రన్నింగ్‌స్టాఫ్, మరి యితర కార్మికులను పనిలేదనే సాకు చూపి ఉద్యోగులకు ఉద్వాపనచెప్పే ప్రమాదం వుంది. దేవస్థానపు యీ చర్యలను వ్యతిరేకిస్తూ సెప్టెంబరునెలలో ట్రాన్సుపోర్టు కార్మికులు పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిపారు ఆందోళన యింకా కొనసాగుతున్నది.

* * *

నెల్లూరు కోపరేటివ్ స్పిన్నింగ్ మిల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం అక్టోబరు 25న ఉపాధ్యక్షులు కామ్రేడ్ జాన్ అధ్యక్షతన జరిగింది.

గత సంవత్సరం సాగించిన కార్యకలాపాల రిపోర్టును ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శ్రీహరి ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

ట్రెజరర్ సిరాజ్ ప్రవేశపెట్టిన సాంవత్సరిక ఆదాయ నివేదిక ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

నవంబరు చివరి వారంలో యూనియన్ ఎన్నికలు జరపాలని అంగీకరించారు. ఐ.ఎన్.టి.యు.సి. నాయకత్వాన గల స్టాఫ్ గూడ ఈ యూనియన్‌లో చేరాలని నిర్ణయించిన దృష్ట్యా, యూనియన్ పేరును స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌గా మార్చాలని తీర్మానించారు.

* * *

నెల్లూరులోగల ఇండో-నిప్పన్ కంపెనీలో ఇటీవల సి ఐ. టి. యు అనుబంధ సంస్థగా నిప్పో ఎంప్లాయీస్ యూనియన్ ఏర్పాటైంది. కామ్రేడ్స్ రంగారావ్, శ్రీహరి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైనారు.

అక్టోబరు చివరన జరిగిన జనరల్ బాడీలో పశ్చిమ బెంగాల్ ఇంజనీరింగు అగ్రిమెంటును అమలు జరపాలని, కాటగిరిలోగల అవకతవకలను సరిచేయాలని డిమాండుచేస్తూ తీర్మానించారు. ఈ కోర్కెలను నవంబరు 15 లోగా అంగీకరించకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవలసి ఉంటుందని నోటీసు జారీ చేశారు.

* * *

ఆంధ్రప్రదేశ్ హైవేస్ అర్ అండ్ బి ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గసమావేశం నవంబరు5న హైద్రాబాద్‌లో జరిగింది. కామ్రేడ్ లక్ష్మీదాస్ అధ్యక్షత వహించారు. వివిధ డివిజన్ల రిపోర్టులు విన్నతర్వాత కొన్నితీర్మానాలు చేయబడినవి. ప్రభుత్వానికిచ్చిన మెమొరాండంలోని 11 పాయింట్లను ఉపాధ్యక్షులు శ్రీ కె. అర్. వీరన్నగారు వివరించారు.

దీర్ఘకాలం పెండింగులోనున్న కోర్కెలను ప్రభుత్వం తక్షణం నెరవేర్చనిచో కార్యాచరణకు పూనుకోవాలని కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది.

వేతనస్థంభనకు వ్యతిరేకంగా

1972 అగస్టు 28 న ఢిల్లీలో జరిగిన వేతన స్థంభన వ్యతిరేక సదస్సు నిర్ణయాల ప్రకారం భారతదేశమంతటా వివిధ రాష్ట్రాల్లో ఈ ఉద్యమం త్వరత్వరగా విస్తరిస్తోంది. సదస్సులు, బంద్‌లు, సమ్మెలు జరుగుతున్నాయి. వేరువేరు కేంద్ర సంస్థలకు చెందిన కార్మిక, ఉద్యోగసంఘాలు ఒక వేదికమీదకు వచ్చి ఒకే గొంతుకతో నినదిస్తున్నాయి.

పంజాబ్ : అక్టోబరు 13న నంగల్‌లో 100 మంది ప్రతినిధులతో, 20వ తేదీన అమృతసర్‌లో 600 మంది ప్రతినిధులతోను, అక్టోబరు 27న జలంధర్‌లో 225 మంది ప్రతినిధులతోను అలాగే పానిపట్‌లోను సదస్సులు జరిగాయి.

ఆంధ్రప్రదేశ్ : 15 సెప్టెంబరు రాష్ట్ర పోరాటకమిటీ ఏర్పడింది. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు తదితర పట్టణాల్లో ప్రదర్శనలుజరిగాయి. నవంబరు3నహైదరాబాద్‌లో 803 మంది ప్రతినిధులతో కన్వెన్షన్ జరిగింది. ఇంకా జిల్లా సదస్సులకు సన్నాహాలు జరుగుతున్నాయి.

పశ్చిమ బెంగాల్ : జూలై 31 న కలకత్తాలో మొదటిసారి కన్వెన్షన్ జరిగింది. అగస్టు 13 న రాష్ట్ర వ్యాపిత నిరసన దినం. ఫ్యాక్టరీల దగ్గర ప్రదర్శనలు నిత్యకృత్య మయ్యాయి. అక్టోబరు 11 న ప్రజాసంఘాలు బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపాయి.

తమిళనాడు : అక్టోబరు 27 న మదురలో 48 సంస్థలు కలిసి సదస్సు జరిపాయి, మదుర రైల్వేస్టేషన్ ముందర జూలై 30 న పెద్దధర్నా జరిగింది. అలాగే కోయంబత్తూరులో కూడ 15 ట్రేడ్‌యూనియన్లు కలిసి జాయింట్ కమిటీని వేశాయి. అక్టోబరు 28న అన్ని ట్రేడ్‌యూనియన్ల సమన్వయ కమిటీ ఏర్పడింది. నవంబరు 8న మద్రాసులో సదస్సు జరిగింది.

కేరళ : సెప్టెంబరు 10న రాష్ట్రవ్యాపిత బంద్ జరిగింది. విద్యుచ్ఛక్తి కార్మికులు అగస్టు 13న త్రివేంద్రంలో నిరసనదినం జరిపారు. ఉపాధ్యాయ ఫెడరేషన్ పిలుపుపై అగస్టు 7 న ప్రదర్శనలు జరిగాయి.

మహారాష్ట్ర: అగస్టు 28న సతారాలో జిల్లాకన్వెన్షన్ జరిగింది. తర్వాత సంగ్లి, షోలాపూర్, కొల్హాపూర్, పర్భని, నాందేడ్ తదితర జిల్లా కేంద్రాల్లోకూడ సదస్సులు జరిగాయి. అక్టోబరు 30న రాష్ట్రవ్యాపిత బంద్ జరిగింది.

కర్నాటక : సెప్టెంబరు 8, 9 తేదీలలో హుబ్లీలో 167 మంది ప్రతినిధులు 80 ప్రేక్షకులతో సదస్సు జరిగింది. మూడు రోజులపాటు అక్టోబరు 14 నుండి 16 వరకు ప్రదర్శనలు జరపాలని నిర్ణయించింది.

ఉత్తరప్రదేశ్ : ఎటాహిలో సెప్టెంబరు 28 న జిల్లా కన్వెన్షన్, అగస్టు 17 న మిర్జాపూర్, నవంబరు 10–11 ల్లో ముజఫర్‌పూర్, నవంబరు 4 కాన్పూరుల్లో సదస్సులుజర్గాయి బులంద్‌షాహర్‌లో 500 మంది ప్రతినిధులతో మరొక సదస్సు జరిగింది.

బీహార్ : సెప్టెంబరు 29 న పాట్నాలో రాష్ట్రసదస్సు జర్గింది. 500మంది ప్రతినిధులు హాజరయ్యారు. నవంబరు 10 న జిల్లా సదస్సులు జరపాలని నిర్ణయం. భాగల్‌పూర్‌లో 100 మందితో సదస్సు. యివన్నీ యు. సి. టి. యు. ఆధ్వర్యాన జరిగాయి.

ఈశాన్య ప్రాంతం : మేఘాలయలోని షిల్లాంగ్‌లో నవంబరు 9, 10 తేదీలలో సదస్సు జరిగింది. మధ్య ప్రదేశ్‌లోని భిలాయ్, గ్వాలియర్, నాగ్దా పట్టణాల్లో సదస్సులు జరిగాయి.

ఐ. యన్. టి. యు. సి. ఎక్కడా పాల్గొనలేదు. తమిళనాడులో డి. యం. కె. యూనియన్లు పాల్గొన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఎ. ఐ. టి. యు. సి. యూనియన్లు పాల్గొన్నాయి. మిగతాచోట్ల యు. సి. టి. యు లోని భాగస్వామ్య సంస్థలన్నీ పాల్గొన్నాయి.

జాపాన్ రైల్వే కార్మికుల మద్దతు

జాపాన్‌లోని జనరల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (సోహ్యో) అనే గొప్ప కార్మిక సంస్థ 48వ నేషనల్ కన్వెన్షనులో 1974 అగస్టు 22న భారత రైల్వే కార్మికులకు మద్ధతు తెలుపుచూ ఒక తీర్మానం ఆమోదించబడింది.

భారత కార్మికులపై అన్యాయంగా జరుగుతున్న నిర్బంధాన్ని తక్షణం కట్టిపెట్టాలనీ, వారిపట్ల చూపుతున్నవివక్షతను ఆపాలనీ, ప్రాధమిక కార్మిక హక్కులను వారికి కల్పించాలనీ ఆతీర్మానంలో కోరబడింది. కక్షసాధింపు చర్యలకు గురవుతున్న భారత రైల్వే కార్మికుల సహాయార్ధం ఆ సంస్థ కొంత అర్థిక సహాయాన్నికూడ పంపిందని తెలుస్తోంది. అంతర్జాతీయ కార్మిక సౌభ్రాతృత్వానికి, యీదొక తాజాఉదాహరణ.

ఎ. ఐ. అర్. యఫ్.

ఎ. ఐ. అర్. ఎఫ్. వర్కింగ్ కమిటి సమావేశం ఢిల్లీలో నవంబరు 1, 2 తేదీలలో జరిగింది. మరల డిశంబరులో జరుగుతుంది. వార్షిక మహాసభ తేదీలు నిర్ణయింపబడతాయి. తొలగింపబడిన రైల్వే పనివారినందరిని ఏమాత్రం అలస్యం చేయకుండా పనిలోకి తీసుకొని తద్వారా మామూలు స్థితిని నెలకొల్పాలని వర్కింగ్ కమిటి ప్రభుత్వాన్ని కోరింది. డిస్మిస్ అయినవారిలో నేటికి సగానికి సగంమంది పనిలోకి తీసుకోబడలేదని వర్కింగ్ కమిటీ సమీక్షలో తేలింది.

		తొలగించబడినవారు			సస్పెన్షన్	మొత్తం
		పర్మినెంట్	టెంపరరీ	క్యాజువల్		
30-5-74	నాటిస్థితి	16532	25350	15685	6229	63796
2-11-74	నాటిస్థితి	4157	11693	11065	4141	31056

ఐ. టి. యఫ్. కమీషన్‌కు అనుమతి నిరాకరణ

భారతదేశంలోని రైల్వే కార్మిక సమ్మె అనంతరం వారి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకుగాను అంతర్జాతీయ ట్రాన్సుపోర్టు వర్కర్స్ ఫెడరేష (ఐ. టి. యఫ్.)చే నియమించబడిన కమీషన్, భారతదేశాన్ని సందర్శించటానికి భారత ప్రభుత్వం అనుమతి నివ్వలేదని తెలిసింది.

జీ. ఓ. నెం. 107 కు సవరణలు

హైవేస్ (R & B) ఎంప్లాయీస్ యూనియన్ కృషి ఫలితం

జి. ఓ. నెం. 107 ను యధాతధంగా అమలు పరిస్తే ఉద్యోగులకు నష్టమనీ, దానిని సవరించవలెననీ ఆంధ్రప్రదేశ్ హైవేస్ (అర్ అండ్ బి) ఎంప్లాయీస్ యూనియన్ కొన్నాళ్ళుగా ఆందోళన చేస్తూయున్నది.

22-10-1974 యూనియన్ సమర్పించిన మెమొరాండం పైన ప్రభుత్వ పబ్లిక్‌వర్క్సు డిపార్టుమెంటు అధికారులకు, యూనియన్ ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగిన ఫలింతగా ఈ క్రింది నిర్ణయాలు చేయబడినవి. మెరిట్ కం ఎఫిషియన్సీకి బదులుగా సీనియారిటీ కం-మెరిట్‌ను ఆధారం చేసుకొని ప్రమోషన్లు యిచ్చేటట్లుగా అంగీకరించటమైనది.

జీ. ఓ. నెం. 407 అమలు:- పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంట్లోని ప్రాజెక్టువింగుతోసహా వరుసగా 10 సంత్సరాల సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులను (మెయింటెనెన్స్ సైడులోని వర్క్ ఛార్జిడ్ ఎస్టాబ్లిష్‌మెంటు) ఎప్పుడు 10 ఏండ్లు పూర్తిఅయితే అప్పుడుప్రొవిన్షియలైజ్ చేయుటకు అంగీకరించటమైనది. అలాగే కన్‌స్ట్రక్షన్‌లోను, వర్క్‌షాపుల్లోనుగల కార్మికులుకూడ వరుసగా 10 ఏండ్లు సర్వీసు పూర్తికాగానే ప్రొవిన్షియలైజ్ చేయబడతారు.

యిదే సందర్భంలో 4-5-1967 నాటి జి. ఓ నెం. 1152 పి. డబ్ల్యు. డి. ప్రకారం ప్రొవిన్షియలైజ్ కాకుండావున్న యన్. యం. అర్. కార్మికుల సర్వీసు భద్రతకు, సర్వీసు కొనసాగింపులకు రక్షణకల్పించవలెనని పబ్లిక్‌వర్క్సుకుచెందిన చీఫ్ ఇంజనీర్లిందరికి మరొకసారి గుర్తుచేయటమైనది.

పశ్చిమబెంగాల్ సి. ఐ. టి. యు. మహాసభ

పశ్చిమ బెంగాల్ రాష్ట్ర సి. ఐ. టి. యు. ద్వితీయ మహాసభ 1974 డిశంబరు 25 నుండి 28 వరకు జల్పాయ్‌గురి జిల్లా మాల్‌బజార్‌లో జరుగుతుంది. ప్రధమమహాసభ 1971లో అసన్‌పోల్‌లో జరిగింది.

300 మంది సభ్యులకు ఒకరుచొప్పున రాష్ట్రమంతటి నుండి 1800 మంది ప్రతినిధులుపాల్గొంటారు. అస్సాం, త్రిపుర, బీహార్, యు. పి. ఒరిస్సా, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర మొదలగు రాష్ట్రాలనుండి సౌహార్ద్రప్రతినిధులు హాజరవుతారు.

మహాసభను కామ్రేడ్ బి. టి. రణదివె ప్రారంభిస్తారు. మహాభను దిగ్విజయం చేయుటకై జల్పాయ్‌గురి, డార్జిలింగ్, తదితర ఉత్తర బెంగాల్ జిల్లాలు చురుకుగా కదలి సన్నాహాలు గావిస్తున్నాయి. శ్రీ రతన్‌లాల్‌బర్మన్ యం.పి. అధ్యక్షుడుగా 105 యూనియన్ల ప్రతినిధులతో ఆహ్వాన సంఘం ఏర్పడింది. టీ తోటల కార్మికులు ఒక రోజు వేతనం విరాళంగా యివ్వాలని తీర్మానించుకున్నారు. స్థానిక విద్యార్ధి, యువజన, మహిళా, రైతు సంఘాలుకూడా అన్నివిధాలా సహకరించడానికి కదులుతున్నాయి.

చేబ్రోలులో చక్కెరమిల్లు కార్మికుల ఆందోళన

పోలీసులచే యిప్పటికి 129 మంది అరెస్టు

పశ్చిమగోదావరిజిల్లా చేబ్రోలులోని నవీన ఖండసారి చక్కెర ఫ్యాక్టరిలో గత 5 ఏళ్ళనుండి పనిచేస్తున్న 150 మంది సీనియర్ కార్మికులను యజమాని కె. ధర్మారావు చట్ట విరుద్దంగా తొలగించిన విషయం పాఠకులకు విదితమే.

ఫ్యాక్టరీ యాజమాన్యం 144 సెక్షన్ పెట్టించి నవంబరు 11 వ తేదీ నుండి పోలీసు కాపలాతో పోటీ కూలీలతో పని చేయిస్తున్నారు. ఇందుకు నిరసన వ్యక్తం చేస్తూనూ, తమను తిరిగి పనిలోకి తీసుకోవాలని డిమాండు చేస్తూ కార్మికులు ఫ్యాక్టరీ గేటుముందు పికెటింగు చేసున్నారు. 11 వ తేదిన లాఠీఛార్జి జరిగింది. మళ్ళీ 12వ తేదీన లాఠీఛార్జి చేసి 14 మందిని అరెస్టుచేశారు. ఒక స్త్రీ స్పృహ కోల్పోయింది.

14 వ తేదీన మళ్ళీ అమానుషంగా లాఠీఛార్జి చేసి 52 మంది స్త్రీలను, 9 మంది పురుషులను అరెస్టు చేశారు. ఒక స్త్రీ కార్మికురాలి చేతివేళ్ళు నలిగిపోయి రక్తం కారింది.

17 వ తేదీన మరి 54 గుర్ని అరెస్టుచేశారు. ఈ విధంగా యిప్పటికి 129 మందిని అరెస్టు చేశారు.

అక్రమంగా తొలగించబడిన సీనియర్ కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోడానికి యజమాని ధర్మారావుగారు మొండిగా నిరాకరిస్తున్నారు. కార్మికులు ముఖ్య మంత్రికి, లేబరు కమీషనర్‌కు యితర ఉన్నతాధికారులకు మెమొరాండంలు పంపుతున్నారు.

యజమాని క్రూరత్వాన్ని, పోలీసుల నిరంకుశత్వాన్ని, పోటీకూలీలతో పనిచేయించడాన్ని, యజమానులకు వత్తాసుగా పోలీసు కాపలాయిస్తున్న ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాన్ని ప్రజాలంతా గర్హిస్తున్నారు.

భీమవరంలో లోకోసిబ్బంది సంఘ కార్యాలయం

నవంబరు 16 వ తేదీన భీమవరంలో లోకోసిబ్బంది సంఘ కార్యలయానికి ప్రారంభోత్సవం జరిగింది. జోనల్ ప్రెసిడెంట్ శ్రీ మునిరెడ్డిగారు ఉత్సవానికి అధ్యక్షత వహించారు. ఎసోసియేషన్ ఆలిండియా అసిస్టెంట్ శక్రటరీ జనరల్ శ్రీ టి. హనుమయ్య ప్రారంభోత్సవం జరిపి ఎసోసియేషన్ పుట్టు పూర్వోత్తరాలను వివరించారు.

భీమవరం బ్రాంచిలోని మొత్తం 52 మంది లోకో సిబ్బంది సంఘంలో అత్యంత ఉత్సాహంతో సభ్యులుగా చేరారు. సాయంత్రం జరిగిన బహిరంగసభలో శ్రీయుతులు టి. హనుమయ్య, మునిరెడ్డి, రామగోవిందం, సి. హనుమంతరావు రాజమండ్రి నుండి శ్రీ సైమన్ మొదలగువారు ప్రసంగించారు.

డిశంబరు 11 న కోర్కెలదినం

విద్యుచ్ఛక్తి కార్మికులసదస్సుపిలుపు

వివిధరాష్ట్రాల్లో సదస్సులు జరపాలనీ అందుకు యూని యనన్నీ యిప్పటినుండే సన్నాహాలు చేయాలనీ డిశంబరు 11వ తేదీన అఖిలభారత విద్యుచ్ఛక్తి కార్మికుల కోర్కెలదినంగాను కక్షసాధింపు చర్యల వ్యతిరేకదినంగాను పాటించాలని గత అక్టోబరు 19, 20 తేదీలలో ఢిల్లీలో జరిగిన విద్యుచ్ఛక్తి కార్మికుల సదస్సు పిలుపు యిచ్చింది.

న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ హాలులో జరిగిన పై సదస్సుకు వివిధ రాష్ట్రాలనుండి మొత్తం 150 మంది ప్రతి నిధులు హాజరయ్యారు. జమ్మూ - కాశ్మీరు, మధ్యప్రదేశ్, మైసూర్,ఆంధ్రప్రదేశ్,ఒరిస్సారాష్ట్రాలనుండి ప్రతినిధులులేరు.

అక్టోబరు 16, 17 తేదీలలో ఢిల్లీలో విద్యుచ్ఛక్తి కార్మి కుల సమస్యలు చర్చించేందుకు గైడ్‌లైన్స్ కమిటీ సమావేశం జరుగుతుందని, అదే సందర్భంలో 19, 20 తేదీలలో విద్యు చ్ఛక్తి కార్మికుల సదస్సు జరపాలనీ సి.ఐ.టి.యు, హెచ్.ఎం. ఎస్.ల ప్రతినిధులు కలసి నిర్ణయించిన విషయం కార్మికలోకం పాఠకులకు తెలిసిన విషయమే.

7 గురు కన్వీనర్ల పేరుతో యీ సదస్సు పిలువబడింది. అనుకున్న ప్రకారం సదస్సు 19వ తేదీన సాయంత్రం 3-30కు ప్రారంభమైంది. సదస్సు నిర్వహణకుగాను కామ్రేడ్స్ చింతన్ (సి. ఐ. టి. యు.) కె. జి. శ్రీవాత్సవా (ఎ.ఐ.టి.యు.సి.) మహేష్ చతుర్వేది (హెచ్.ఎం.ఎస్), జార్ఖండ్‌రాయ్ (అఖిల భారత విద్యుచ్ఛక్తి ఉద్యోగుల ఫెడరేషన్), యస్. ఆర్. సేన్ గుప్తా (దామోదర వ్యాలీకార్పొరేషన్ స్టాఫ్ ఎసోసియేషన్) లక్ష్మినారాయణ (డి. ఇ. యస్. యు. వర్కర్స్ యూనియన్) గార్లు అధ్యక్షత వర్గంగా ఎన్నుకోబడ్డారు,

సదస్సు జరగటానికి పూర్వరంగాన్ని వివరిస్తూ కామ్రేడ్ ఎ. బి. బర్ధన్ ప్రసంగించారు. కేంద్ర ట్రేడ్ యూనియన్ సంస్థల ప్రతినిధులు. కామ్రేడ్ బాలానందన్ (సి. ఐ. టి. యు) శ్రీ వాత్సవ (ఎ.ఐ.టి.యు.సి), యస్. అర్. సేన్‌గుప్తా (డి.వి. యు.టి.యు.సి.), మహేశ్ చతుర్వేది (హెచ్.యం.యస్.) లక్ష్మినారాయణ్ (డి.ఇ.యస్.యు.)గార్లు మాట్లాడారు.

సదస్సు ఆమోదించిన ప్రధానతీర్మానంలో విద్యుచ్ఛక్తి పరిశ్రమ కార్మికుల కనీస వేతనాలు డి.ఎ. యీపాటికె పబ్లిక్ సెక్టరులో అనే పరిశ్రమల్లో కుదిరిన ఒప్పందాల స్థాయికైనా పెంచాలనీ కోరబడింది. ఈ పరిశ్రమలో కార్మికుల వేతనాల పునర్నిర్ణయం ఈపాటికే ఆలస్యమైందనీ యికనెంతమాత్రమూ వాయిదా వేయటానికి వీలులేదని స్పష్టం చేయబడింది. $6\frac{1}{2}$ లక్షల మంది విద్యుచ్ఛక్తి కార్మికులకు చెల్లించుతున్న డి.ఎ. చాలా తక్కువగా వుందనీ (1960 సూచి పునాదిగా పెరిగిన పాయింటుకు 75 పైసలు) దీనిని తక్షణం పెంచవలె ననీ, రాష్ట్రానికీ రాష్ట్రానికి మధ్య, ఒకేరాష్ట్రంలో ఒక చోటుకు మరొక చోటికి మధ్య విపరీతమైన వ్యత్యాసా లున్నా యనీ వీటిని తొలగించాలనీ తీర్మానం డిమాండు చేసింది.

అలాచేస్తేనే ఈనాడు ఏర్పడిన విద్యుచ్ఛక్తి కొరతను

లోకో ఫోర్‌మన్ చర్యలకు నిరసన

బిట్రగుంట లోకోషెడ్ ఫోర్మన్ సమ్మె అనంతరం కార్మికులను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకొని వ్యవహరిస్తు న్నాడు. కక్ష సాధింపు చర్యలు సాగిస్తున్నాడు. అక్రమ ట్రాన్స్ఫర్లు జరుపుతున్నాడు.

ఈ ఫోర్‌మన్ చర్యలకు నిరసనగా నవంబరు 18 నుండి నిరవధిక నిరాహారదీక్ష ప్రారంభింపబడింది. అక్రమ ట్రాన్స్ ఫర్లను రద్దుచేసిన పిమ్మట నిరాహారదీక్ష విరమింపబడింది.

నిరాహారదీక్ష సాగుతున్న సమయంలో చుట్టుప్రక్కల ప్రాంతాలనుండి, నెల్లూరునుండి సి. ఐ. టి. యు సంఘాలకు చెందిన సోదర కార్మికులువచ్చి నిరాహారదీక్షకు మద్దత్తుగాను, ఫోర్మన్ చర్యలపట్ల నిరసనగాను ప్రదర్శనలు జరిపారు.

తీర్చటానికి $6\frac{1}{2}$ లక్షలమంది విద్యుచ్ఛక్తి కార్మికుల శక్తిని సమీకరించటం సాధ్యపడుతుందనీ, వెంటనే జాతీయస్థాయిలో చర్చలు సాగించటానికి విద్యుచ్ఛక్తి శాఖామంత్రి చొరవ తీసుకోవాలనీ కోరింది.

నవంబరు 16 నుండి 30 వరకు రాష్ట్రాలస్థాయిలో అన్ని యూనియన్లతోకూడిన సదస్సులుజరిపి డిశంబరు 11న కోర్కెల దినం, కక్షసాధింపు చర్యల వ్యతిరేక దినం పాటించాలని ప్రదర్శనలు జరపాలనీ యూనియన్లన్నింటికీ సదస్సు పిలుపు యిచ్చింది.

ప్రభుత్వం మేనేజిమెంట్లు కనుక వెంటనే కదలి సంప్ర తింపులు ప్రారంభించి పరిష్కారం చేయనట్లయితే ముందుగా ఒకరోజు సమ్మె, ఆ తర్వాత నిరవధిక సమ్మెకు కార్మికులను నెట్టిన బాధ్యతవారిదేఅవుతుందనికూడ సదస్సు హెచ్చరించింది.

విశాల ప్రాతిపదికపైన,ఉద్యమాన్ని నిర్మించుటకుగాను విద్యుచ్ఛక్తి కార్మికసంఘాల జాయింట్ కౌన్సిలు నొకదానిని ఏర్పాటు చేస్తూ సదస్సు తీర్మానించింది.

విద్యుచ్ఛక్తి కార్మికసంఘాలన్నీ, ప్రత్యేకించి ఐ. ఎన్. టి. యు. సి. సంఘాలు జాయింట్ కౌన్సిలు బ్యానరు దరిన చేరాలని విజ్ఞప్తి చేయబడింది. ఐ.యన్.టి.యు.సి.యూనియన్ల ప్రతినిధులు గైడ్‌లైన్స్ కమిటీ సమావేశాల్లో సహకరిస్తున్నట్లు గానే యీ జాయింట్‌కౌన్సిలులోకూడ సహకరించవలసిందిగా కోరబడినది.

గ్రాడ్యుయేట్ గుమస్తాజీతం నెలకురు1057-లు సింధియా ఒప్పందం

సింధియా మేనేజిమెంటుకూ ఎంప్లాయీస్ యూని యన్లకూ 5-10-1974 న బొంబాయిలో ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం 31-12-1974న సబ్ స్టాఫ్‌కు నెలకు రు. 810-00 ప్రారంభ జీతం. గ్రాడ్యుయేట్ గుమస్తాకు నెలకు రు. 1057-00 లు జీతం. భారతదేశ మంతటిలోకి ఎక్కువగా నున్న ప్రారంభజీతం యిదే. అవసరాల ప్రాతిపదికపై కనీస వేతనం పొందాలన్న కార్మికవర్గపు కోర్కె కనీసం ఒక్క పరిశ్రమలోనన్నా ఆ విధంగా నెరవేరింది. జీతాల నిర్ణయానికి సంబంధించినంతవరకు భారతదేశంలోనే యిది చెప్పుకోదగిన ఘటన.

వేతనస్థంభన చట్టాన్ని ఉపసంహరించాలి: రాష్ట్ర శ్రామిక సదస్సు డిమాండ్

వేతనస్థంభన విధానానికి వ్యతిరేకంగా అగస్టు 28 న న్యూఢిల్లీలో జాతీయస్థాయిలో ఒక సదస్సు జరిగి నేషనల్ క్యాంపెయిన్ కమిటీ ఏర్పడటమూ, రాష్ట్రాల్లోకూడ ప్రతిఘటనోద్యమాలను నిర్మించాలని పిలుపు యివ్వడమూ కార్మికలోకం పాఠకులకు తెలిసిన విషయమే. ఆ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ట్రేడ్ యూనియన్ సంస్థలు కలిసి సెప్టెంబరు 15 న పోరాట కమిటీని ఏర్పాటుచేశాయి.

ఈ పోరాట కమిటీ యిచ్చిన కార్యక్రమం రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో జయప్రదంగా అమలు జరుపబడింది. అక్టోబరు 9, 10 తేదీలలో అనేక ప్రాంతాల్లో యన్.జి ఓ. లు తంతి తపాలా ఉద్యోగులు, కార్మికులు ప్రదర్శనలు జరిపారు. అక్టోబరు 29 న ధర్నా జరుపబడింది. భవిష్యత్తుకార్యక్రమాన్ని నిర్ణయించుటకుగాను నవంబరు 3న రాష్ట్ర సదస్సు హైదరాబాద్‌లో సరోజినీదేవి హాలులో జరిగింది.

సదస్సుకు దాదాపు అన్ని జిల్లాలనుండి 102 సంఘాల తరఫున 803 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇది సదస్సు యొక్క విస్తృత ప్రాతిపదికను తెలుపుతుంది.

పోరాట కమిటీ కన్వీనరు శ్రీ డి.ఆర్.కె. రెడ్డి (ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఎంప్లాయీస్ ఎసోసియెషన్ అధ్యక్షులు) ప్రతినిధులకు స్వాగతం పలికారు. పోరాటకమిటీ చేసిన కృషిని వివరించారు.

సదస్సుకు శ్రీయుతులు ఐ. బి. రామకృష్ణారావు (ఆంధ్ర ప్రదేశ్ యన్. జి. ఓ.ల ఎసోసియేషన్ అధ్యక్షుడు), పర్స సత్యనారాయణ (సి. ఐ. టి. యు. ఆంధ్రప్రదేశ్ కమిటి అధ్యక్షులు), శ్రీబి.ఎన్.కె. ఆచార్య (కేంద్ర ప్రభుత్వోద్యోగుల సర్వసమాఖ్య రాష్ట్రశాఖ అధ్యక్షులు), శ్రీ డి. రంగారావు (ఇన్సూరెన్సుకార్పొరేషన్ ఎంప్లాయీస్‌యూనియన్ ప్రధాన కార్యదర్శి) శ్రీ సీతల్‌సింగ్ లస్కరి (హెచ్. యం. పి. రాష్ట్ర శాఖ అధ్యక్షులు) అధ్యక్షవర్గంగా ఎన్నుకోబడ్డారు.

పిమ్మట సి. ఐ. టి. యు. ప్రధాన కార్యదర్శి శ్రీ పి. రామమూర్తి సదస్సులో ప్రారంభోపన్యాసం చేశారు. పశ్చిమ దేశాలనుండి సహాయం, పెట్టుబడులను ఆకర్షించడం కోసమే ప్రభుత్వం దేశంలో కార్మికవర్గంపై విరుచుకుపడుతోందని ప్రభుత్వం విసరిన సవాలును ఎదుర్కొనడానికై కార్మికవర్గం నిలబడటం హర్షదాయకమనీ ఒకటి రెండు నెలల్లో పరిస్థితిని సింహావలోకనం చేసి పోరాట కార్యక్రమాన్ని రూపొందించ గలమని అన్నారు.

శ్రీ యస్. కె. వ్యాస్ (కేంద్రప్రభుత్వోద్యోగుల సర్వసమాఖ్యప్రధానకార్యదర్శి), శ్రీ కె.ఆదినారాయణ (ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ క్లాస్ IV యూనియన్ ప్రధాన కార్యదర్శి), ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ ఎసోసియేషన్ సహాయ కార్యదర్శి శ్రీ మాంచందా సందేశాలు యిచ్చారు.

పిమ్మటసారధ్యకమిటీ పక్షాన శ్రీ నండూరి ప్రసాదరావు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పోస్టల్‌క్లాసు III ఉద్యోగుల సంఘ సహాయకార్యదర్శి శ్రీ పురుషోత్తంరాజు మరొక తీర్మానాన్ని ప్రతిపాదించారు. సారధ్యకమిటీ తరఫున శ్రీ ప్రసాదరావు ప్రతిపాదించినతీర్మానమే ప్రాతిపదికగాతీసుకోబడింది.

కేంద్రప్రభుత్వం శ్రామికజనంపై యుద్ధం ప్రకటించిందనీ దానిలో భాగమే వేతనస్థంభనచట్టం అనీ యీ చట్టాన్ని తక్షణం ఉపసంహరించాలని తీర్మానం డిమాండ్‌చేసింది.

ఈ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులపై కొనసాగించబడుతున్న తీవ్ర నిర్బంధ విధానాన్ని ఖండించింది.

పోరాటం కష్టభరితంగా సుదీర్ఘంగా వుంటుంది కనుక పట్టుదలతో సాగించాలని కార్మికవర్గానికి విజ్ఞప్తిచేసింది.

సదస్సులోపాల్గొనని యితర ట్రేడ్‌యూనియన్ సంస్థలు కూడ యికముందు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

చర్చలనంతరం స్వల్పసవరణలతో తీర్మానంఏకగ్రీవంగా ఆమోదించబడింది.

పిమ్మట బోనసు రివ్యూకమిటీ నివేదికను విమర్శిస్తూ శ్రీ సీతల్‌సింగ్ లస్కరి ప్రతిపాదించిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటనను నిర్మించి సాగించుటకు పోరాట కమిటీని, ఆ సభ్యులలోనుండి 9 మందితో సారధ్య సంఘాన్ని ఎన్నుకోవటమైనది.

అనంతరం సరోజినీదేవి హాలునుండి బయలుదేరి ముఖ్యమైన వీధులగుండా ఊరేగింపు జరిగి సరోజనీదేవి హాలుకు చేరుకుంది. శ్రీ సీతల్‌సింగ్ లస్కరి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. సభలో శ్రీయుతులు బి. యన్. రెడ్డి (యం. పి.), పి. రామమూర్తి, ఎస్. కె. వ్యాస్, కె. ఆదినారాయణ, మాంచాందాగార్లు ప్రసంగించారు.

గమనిక

అనివార్య కారణాలవల్ల ఈ సంచిక 8 పేజీలతో తెస్తున్నాం. పాఠకులు మన్నించ కోరుతున్నాం.

— సంపాదకులు.

తణుకు తాలూకా పోరాట కమిటీ

వేతన స్తంభన చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకుగాను పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకాలో పోరాట కమిటీ ఏర్పడింది. సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీ జి. జనార్దనరావుగారు కన్వీనరుగా 16 మంది ట్రేడ్ యూనియన్ల నాయకులతో కలిపి ఏర్పాటు చేయబడింది. ఎ. ఐ. టి. యు. సి ప్రతినిధులుకూడా ఇద్దరు ఈ కమిటీలో సభ్యులుగా వున్నారు.

ప్రజాశక్తిప్రెస్ విజయవాడలో ముద్రింపబడి, సి. ఐ. టి. యు. ఆంధ్రప్రదేశ్ కమిటీ పక్షాన శ్రీ నండూరి ప్రసాదరావుచే విజయవాడ నుండి ప్రకటింపబడింది. ఎడిటర్ : శ్రీ నండూరి ప్రసాదరావు.

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLV01A1K
పుస్తకం పేరు	కార్తీక లోకం
తారీఖు	23-8-23
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	9
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Jyothi
పేజీలు విడదీసినది	Jyothi
స్కాన్ చేసినది	Mounika
పరీక్ష చేసినది	MANASA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	Good